క్లుప్తంగా

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సారంగపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి), యాకర్‌పల్లి, జామ్, సారంగపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఏఎంసీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నాయకులు ఆదివారం ప్రారంభించారు. కేంద్రాల్లో మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1962 చెల్లిస్తారని, రైతులు విక్రయించి ధర పొందాలన్నారు. నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాధవరావ్, మాణిక్‌రెడ్డి, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్‌కు సన్మానం



లక్ష్మన్నను సన్మానిస్తున్న నాయకులు

భైంసారూరల్: మిర్జాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన చాకెటి లక్ష్మన్నను ఆదివారం పలువురు నాయకులు సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ నాయకుడిగా, విద్యావంతులవేదిక నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారు. ఉద్యమకారుడికి వైస్ చైర్మన్ పదవి దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి భైంసా డివిజన్ అధ్యక్షుడు సట్వాజీసాంగే, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మాజీచందనే, ఎస్సీ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు లక్ష్మణ్‌జాడే, ఉపాధ్యక్షుడు గుండేరావు పోతన్న పాల్గొన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట్, మలక్ జాం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. శ్రీ గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవను గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాలం శ్రీనివాస్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన బోగ గజ్జారాం, ఓలా గ్రామానికి చెందిన సులువ పోశెట్టి ఇటీవల మృతి చెందారు. ఓలా గ్రామానికి చెందిన సయ్యద్ రఫీగ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. మంత్రి ఐకేరెడ్డి పీఏ నాలం శ్రీనివాస్ ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట హుస్సేన్, నాలం సాగర్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న జేపీఎస్‌లు

భైంసారూరల్: రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్‌ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డివిజన్ అధ్యక్షుడు తోట సంజీవ్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలో పదో రోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లయినా జేపీఎస్‌ల సమస్యలు పట్టించుకోలేదన్నారు. వేకువజాము నుంచే విధులు నిర్వర్తిస్తున్న జేపీఎస్‌లపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం తగదన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి

నిర్మల్‌ఖిల్లా: దేశం స్వాతంత్య్రం కోసం తిరుగుబాటు చేసిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి అనుసరణీయమని ఐఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లోని బాబ్జీభవన్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, కిషన్, గణేశ్ తదితరులు ఉన్నారు.



బైల్‌బజార్ వద్ద ఏపుగా పెరిగిన వేప చెట్టును నరికేసిన సిబ్బంది



విశ్వనాథ్‌పేటలో..



చెట్లను నరికేసిన దృశ్యం



హరితహారం అభాసుపాలు

రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇలాకా అయిన నిర్మల్‌లో హరితహారం కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యానికి అభాసుపాలవుతోంది. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బైల్‌బజార్ నుంచి విశ్వనాథ్‌పేట, గండి రామన్న సాయిబాబా ఆలయం వరకు మొక్కలు నాటడంతో అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. అవి విద్యుత్ తీగలకు అడ్డు వస్తుండడంతో అధికారులు చెట్లను నరికేస్తున్నారు. వాటిని తొలగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

హరితహారానికి సర్వం సిద్ధం



కుంటాల నర్సరీలో మొక్కలు

- అందుబాటులో నర్సరీల్లో మొక్కలు
- ఇంటింటికీ ఆరు మొక్కలు
- పంపిణీకి సిద్ధం చేస్తున్న అధికారులు

కుంటాల: రాష్ట్రంలో అడవుల శాతం పెంచేందుకుగాను రాష్ట్రప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుతోపాటు ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేసింది. వాటిని సంరక్షించడంతో ఏపుగా పెరిగి పరిసరాలు పచ్చదనంతో కనిపిస్తున్నాయి. కుంటాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 15 నర్సరీల్లో వేసవికి ముందే పూల, పండ్ల మొక్కలతోపాటు ఇతర్రావి మొక్కలు పెంచుతున్నారు. వాటికి ప్రతిరోజు నీళ్ల పట్టించడంతోపాటు చలువ పందిళ్లు వేయించారు. ప్రతి నర్సరీలో 11 వేల చొప్పున మండల వ్యాప్తంగా లక్షా 65 వేల మొక్కలను పెంచి సంరక్షించారు. 9వ విడత హరితహారంలో భాగంగా ఈ వర్షాకాలంలో ప్రతి ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలని అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఆహ్లాద వాతావరణం

గ్రామాలు పచ్చదనంతో కళకళలాడాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం నర్సరీలు ఏర్పాటు చేసింది. ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేసి నాటేలా చర్యలు తీసుకుంది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక మహిళలు, విద్యార్థులను హరితహారంలో భాగస్వాములను చేసి మొక్కల సంరక్షించే చర్యలు చేపడుతోంది. గతంలో రోడ్లకు ఇరు వైపులా, కాలనీలో నాటిన మొక్కలు చెట్లుగా పెరిగి ఆహ్లాద వాతావరణాన్ని పంచుతున్నాయి.



కుంటాల రాంనగర్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

సిద్ధం చేశాం



గ్రామాల్లో నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాం. ప్రతిరోజు నీళ్ల పట్టడంతోపాటు సంరక్షణ చర్యలు తీసుకున్నాం. త్వరలో ప్రతి ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశాం.

– గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల

పొంచి ఉన్న ప్రమాదం



నిర్మల్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో అక్కాపూర్ శివారులో సబ్‌స్టేషన్ పక్కన అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్ కిందకు హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా రియల్ వ్యాపారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వెంచర్‌కు అనుమతి ఇవ్వడంపై అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

భైంసాలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు



మాట్లాడుతున్న ఏడీఈ ఆదిత్య

భైంసా: డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆదివారం విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ ఆదిత్య మాట్లాడుతూ రైతులు, వినియోగదారులు భద్రత సూచనలు పాటించాలన్నారు. పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వంగిన స్తంభాలు భారీ వర్షాలు కురిస్తే పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దుక్కి దున్నే సమయంలో, పొలాల్లో పనిచేసే సమయాల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగితే సంబంధిత లైన్‌మెన్‌కు ఫోన్ చేయాలన్నారు. 18004250028 టోల్‌ఫ్రీ నంబర్ వినియోగించుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో 1912కు కాల్‌చేయాలని సూచించారు. ఆరోగ్య భారతి రాష్ట్ర సభ్యుడు డా.రామకృష్ణాగౌడ్, సబ్ ఇంజినీర్ భాషా, ఎఫ్ఎం బాపురావు, కుంటాల లైన్‌మెన్ శ్రీనివాసరాజు, దావు, చందు, కిషన్, నాయకులు బాలాజీసూత్రావే తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: విద్యుత్ వినియోగంపై మండల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ మహేశ్ పేర్కొన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సిబ్బంది, ప్రజలతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా విషయంలో పనిచేసే క్రమంలో సిబ్బంది చేతులకు గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎల్‌సీ తీసుకునే క్రమంలో సబ్‌స్టేషన్‌లోని ఆపరేటర్‌తో సరఫరా నిలిపివేశాకే పని చేయాలన్నారు. విద్యుత్ పొదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన అధికారులకు వివరించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్‌రావు

లోకేశ్వరం: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు సూచించారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యం డబ్బులు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, ఎంపీటీసీ దత్తురాం పటేల్, నాయకులు గజ్వేరి భూమన్న, శ్యాంసుందర్, సుదర్శన్‌రెడ్డి, మల్లేశ్, గోపాల్, శ్రీనివాస్, నర్సయ్య, ప్రేమనందం పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీతకు సన్మానం



శంకర్‌ను సన్మానిస్తున్న తోటి స్నేహితులు

లక్ష్మణచాంద: వివిధ రంగాల్లో కృషిచేసినందుకుగాను వడ్యాల్ గ్రామ వాసి ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్‌కు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. ఇటీవల అంబేడ్కర్ 132 వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మెగా సిటీ కళానివేదిక –మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. 1994–95 బ్యాచ్ పదో తరగతి చదివిన స్నేహితులు శంకర్‌ను ఆదివారం కలిసి సన్మానించారు. వైద్యుడు రమేశ్, వేణుగౌడ్, రాము, నర్సయ్య, ప్రదీప్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, జీవన్, రాజేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం



వడ్‌గాంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకుడు మోహన్‌రావ్ పటేల్

తానూరు: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి తెలంగాణలో ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌ను కోరుకుంటున్నారని బీజేపీ నాయకుడు మోహన్‌రావ్ పటేల్ అన్నారు. మండలంలోని నంద్‌గాం, సింగన్‌గాం, వడ్‌గాం గ్రామాల్లో పల్లెపల్లెకూ బీజేపీ, గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్రూం ఇస్తామని ఇప్పటికి ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం వడ్‌గాంలో బీజేపీ జెండా ఆవిష్కరించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. యువ నాయకుడు గోపాల్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ సుభాష్ పటేల్, నాయకులు జ్ఞానేశ్వర్, చక్రధర్ పటేల్, కోలూరు జ్ఞానేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

భైంసారూరల్/ఖానాపూర్/కుంటాల: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. భైంసా మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో వీరి సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు విరమించబోమని ఖానాపూర్‌లో వీవోఏలు తేల్చిచెప్పారు. కుంటాలలో చేపట్టిన సమ్మెలో వీవోఏల మండల కన్వీనర్ బక్కి మహేశ్, వీవోఏలు గౌతమ్, దేవన్న, శంకర్, రవూఫ్, సంపత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌లోని రేణుక ఎల్లమ్మతల్లి పట్నాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు, యువతులు నెత్తిన బోనాలతో, డప్పుచప్పుళ్లు, బైండ్లోళ్ల నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. బోనాలను ఎల్లమ్మకు నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. గౌడ కులస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ముధోల్: రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఏఎస్సై సుదర్శన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో వాహనదారులకు ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అతి వేగంగా వాహనాలు నడపొద్దని సూచించారు. వాహనదారులు తమవెంట వాహన ధ్రువపత్రాలు తెచ్చుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం



బీరప్ప పెద్దల డోలు వాయింపు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో బీరప్పస్వామి కామరతి దేవి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కురుమ సంఘం సభ్యులు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ పండుగ, సరుగు, లగ్గం బోనాలను స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా బీరప్ప పెద్దల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు జెడ్ల రాజారం, గ్రామ అధ్యక్షుడు లింగం, గ్రామపెద్దలు ఉన్నారు.

తారురోడ్డు నిర్మించరూ..



లోకేశ్వరం: లోకేశ్వరం–నందిపేట్ ప్రధాన రహదారిపై పంచగుడి శివారు ప్రాంతంలోని గోదావరి నదిపై వంతెన నిర్మించారు. లోకేశ్వరం నుంచి పంచగుడి వంతెన వరకు అక్కడక్కడ తారు రోడ్డు పనులను వివిధ కారణాలతో నిలిపివేశారు. అయితే నిలిచిపోయిన పనులు కొనసాగుతున్నాయి. లోకేశ్వరం, పంచగుడి గ్రామాల వద్ద కొంతదూరం మట్టి రోడ్డు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు ప్రారంభించారు. అంతవరకు బాగానే ఉన్నా, తారు రోడ్డు వేయడంలో జాప్యంతో బస్సులు, వాహనాలు రాకపోకలతో దుమ్ము వస్తుండడంతో పలువురు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తారు రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని నాయుడువాడ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు సాదం అరవింద్, కార్తికంటి గంగాధర్, నాయిడి రమేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా కొర్తికంటి లింగన్న, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్యగారి కృష్ణ, కోశాధికారిగా గజ్జ మహేశ్, ఉపకోశాధికారి నరేశ్, ఉపాధ్యక్షులుగా లింగన్న, పోశెట్టి, ఉప కార్యదర్శిగా పుల్లయ్యగారి రమేశ్, జాయింట్ సెక్రెటరీగా రామ్ సాయినాథ్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, శిరీష్, ఆడిటర్స్‌గా రామ్ మహేష్, రాములు, సలహా సభ్యులుగా తాటికుండ రమేశ్, వెంకటరమణ, కూన ప్రసాద్, కొర్తికంటి రమేశ్, కిషన్, పెంట నర్సయ్య, రామ్ రమేశ్, భూమన్న, ఆకుల రమేశ్, దివాకర్ ఎన్నికయ్యారు. వీరిని సంఘం సభ్యులు సన్మానించారు.

మేరు సంఘం మండల కమిటీ ఎన్నిక

లోకేశ్వరం: మేరు సంఘం మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, సభ్యులుగా సాయినాథ్, భోజారాం, రాజు, సాయినాథ్, శివరాం, ముత్యం ఎన్నికయ్యారు. నాయకులు మహేందర్, రమేశ్‌బాబు ఉన్నారు.

నేడు సీఎం కప్ టోర్నీ ఏర్పాట్లపై సమావేశం

లక్ష్మణచాంద: సీఎం కప్ టోర్నీ ఏర్పాట్లపై ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పద్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందని ఎంపీడీవో మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎస్వీజీ డిగ్రీ కళాశాలలో ఈనెల 15,16,17 తేదీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీ, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 15 నుంచి 36 ఏళ్లలోపు వారు ఈనెల 10 వరకు సూపరింటెండెంట్ రమేశ్ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

కడెం: మండలంలోని లింగాపూర్‌కు చెందిన దానవేణి దీపక్, జగిత్యాల జిల్లా ఐలాపూర్‌కు చెందిన దువ్వ సుదర్శన్ ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. కడెం పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా ఐఎంఈఐ నంబర్‌తో ట్రేస్ చేసి పట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై రాజు, టెక్‌టీం కానిస్టేబుల్ శంకర్ ఆదివారం వారికి అప్పగించారు.

కులవృత్తిదారుల పొట్టకొట్టొద్దు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నిర్మల్‌టౌన్: కులవృత్తుల ఆధారంగా జీవనం కొనసాగించే వారి బతుకుల్లో కార్పొరేట్ సంస్థలను తీసుకురావడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 74 శాతం బీసీ కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబాలు వారి కులవృత్తులు చేసుకుంటే గత నాలుగేళ్లుగా పెద్ద నగరాల్లో లేని షాపింగ్ మాల్స్‌ను నిర్మల్‌కు తీసుకువచ్చి, చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు వెంటనే రుణాలివ్వాలని, ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అశోక్‌చారి, కిషన్, నర్సింలు పాల్గొన్నారు.